సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 24 । జూలై । 2025



హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

హెల్మెట్ బరువు కాదు, బాధ్యత అని, ప్రాణాలకు రక్ష అని ఎస్పీ ఎస్సీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు. -8లో



ఆరా పేరుతో టోకరా!

ఆరా యాప్ పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన వైనం మదనపల్లెలో వెలుగు చూసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 465 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

విధుల నుంచి ఉపాధ్యాయురాలు తొలగింపు

రాయచోటి జగదాంబసెంటర్: సంబేపల్లె మోడల్ స్కూల్‌లో పీజీటీ(ఇంగ్లీష్) ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కె.రజియాను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24.01.2023వ తేదీ నుంచి ఎటువంటి ముందస్తు సమాచారం కానీ, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైందన్నారు. ఈ విషయమై మోడల్ స్కూల్ ప్రధానాచర్యుల ద్వారా నోటీసు కూడా పంపినట్లు చెప్పారు. ఏపీ మోడల్ పాఠశాలల నిబంధనల మేరకు కె.రజియాను విధుల నుండి తొలగించినట్లు డీఈఓ తెలియజేశారు.

పెన్నానదికి జలకళ



సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని పెన్నానదిలో బుధవారం తెల్లవారు జాము నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో జలకళ సంతరించుకుంది. వర్షాలు సక్రమంగా కురవక, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పెన్నా పరీవాహక ప్రాంతాల రైతులు వ్యవసాయ బోర్లలో నీరు లేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షాలు కురవడంతో పెన్నాకి వరద నీరు వచ్చి చేరడంతో నదీ ఒడ్డున ఉన్న గ్రామాల్లోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

రాయచోటి జగదాంబసెంటర్: వేరుశనగ పంటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు రైతులకు ఎంతో లాభదాయకమని, భూమి ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. బుధవారం రాయచోటి మండలం గొర్లముదివీడు క్లస్టర్ ఎండపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలతో వేరుశనగ సాగు ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ఈ మోడల్‌లో 400 కేజీల ఘన జీవామృతం వినియోగించడం ద్వారా వానపాములు భూమిని గుల్లగా చేసి, భూమి లోపల జీవవైవిధ్యాన్ని పెంచుతాయన్నారు. రైతులు ఈ పద్ధతులను అనుసరించడం వల్ల పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరగడం ద్వారా నికర ఆదాయం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ రమణనాయక్, మాస్టర్ ట్రైనర్ చిన్నరెడ్డయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుముహూర్తాల శ్రావణం



- ఈనెల 26 నుంచి వరుస ముహూర్తాలు
- పురోహితులు, మంగళ వాయిద్యాలు, డెకరేషన్లకు డిమాండ్
- కరువుతో బంగారు, వస్త్రాల కొనుగోళ్లపై ప్రభావం



కల్యాణ వేదిక



రాజంపేట టౌన్/మదనపల్లె సిటీ/కడప సెవెన్‌రోడ్స్: శుభాల శ్రావణం వచ్చేస్తోంది. శ్రావణం అనగానే సుముహూర్తాలు మోసుకొచ్చేదిగా ప్రజలు భావిస్తారు. ఇప్పటికే గురు మూఢం కారణంగా 48 రోజులుగా ఎక్కడా శుభ కార్యాలు లేవు. అందుకే శ్రావణ మాసంలో ముఖ్యంగా జిల్లాలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. వీటితోపాటు భూమి పూజలు, గృహ ప్రవేశాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. శ్రావణ పౌర్ణమికి ముందు అంటే ఆగస్టు 8వ తేది వచ్చే వరలక్ష్మీవ్రతం మహిళలకు అత్యంత విశేషమైనది. మాఘం, వైశాఖం, శ్రావణం, మార్గశిర మాసాలు వివాహాలు, శుభ కార్యాలకు అనుకూలమైనవి.

ఆశల పల్లకిలో..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి. ఇప్పటికే జిల్లాలోని కల్యాణ మండపాలన్నీ రిజర్వ్ అయ్యాయి. ఇక పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలపై ఆధారపడ్డ వస్త్ర దుకాణదారులు, బంగారు వ్యాపారులు, మంగళ వాయిద్య కళాకారులు, వంట వారు, క్యాటరింగ్ సిబ్బంది, హోటళ్ల యజమానులు, పూల వ్యాపారస్తులు, మండపాల డెకరేషన్ నిర్వాహకులు తదితరులు ప్రస్తుత శ్రావణమాసంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వివాహ క్రతువులను నిర్వహించడంలో పురోహితులే కీలకం. వీరికి ఈ సీజన్‌లో బాగా డిమాండ్ ఉంటుంది. కడప నగరంలో ఈ మాసంలో పౌరోహితులు సగటున ఐదు వివాహాలు నిర్వహించనున్నారు.

సుముహూర్తాలు ఇవే..

శ్రావణమాసం ప్రారంభమైన మరుసటిరోజు నుంచే మంచి ముహూర్తాలు మొదలవుతాయని పురోహితులు వివరిస్తున్నారు. జూలై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17వ తేది వరకు ఉన్నాయి. మళ్లీ సెప్టెంబరు 23, 24, 26, 27, 28 తేదీలు మంచి ముహూర్తాలుగా చెబుతున్నారు. అక్టోబరులో 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబరులో 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27 తేదీల్లో వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలని పేర్కొంటున్నారు.



శ్రావణం శుభప్రదం

ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి నుంచి దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమైంది. ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో వివాహాలు, శుభకార్యాలకు అనుకూలంగా ఉంటుంది. సనాతన ధర్మంలో వివాహం ప్రధానమైనది. వీటిని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తే ఆ జంటకు మంగళం జరుగుతుంది. ప్రస్తుతం ఆడంబరాలకు ప్రాధాన్యత పెరిగి ఆచార వ్యవహారాలు తక్కువై పోతున్నాయి. ముందురోజు రాత్రే రిసెప్షన్ ఏర్పాటు వల్ల ముహూర్తానికి హాజరయ్యే వారి సంఖ్య బాగా తగ్గిపోవడం ఆందోళన కలిగించే పరిణామం. ఆర్థిక స్తోమత లేని పేద వారికి వివాహ క్రతువును మేము ఉచితంగా నిర్వహిస్తున్నాం.

– కె.విజయ్‌భట్టర్, అధ్యక్షులు, జిల్లా అర్చక పురోహిత సమాఖ్య, కడప


నోముల మాసం..

పురోహితులు శ్రావణాన్ని నోముల మాసంగా అభివర్ణిస్తారు. మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతాలు ఈ మాసంలోనే ఆచరిస్తారు. శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మనక్షత్రం కావడం వల్ల ఈమాసం విష్ణుపూజలకు ప్రసిద్ధి. మంగళవారం గౌరి పూజలు, శుక్రవారం లక్ష్మీపూజలు, శనివారం విష్ణుపూజలు చేస్తారు. అలాగే అందుబాటులో ఉండే అమ్మవారి ఆలయాల్లో మహిళలు నిత్యం విశేషంగా పూజలు నిర్వహిస్తారు. ఇదిలావుంటే శ్రావణ మాసంలో శుక్రవారానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈఏడాది శుక్రవారంతోనే శ్రావణమాసం ప్రారంభం కానుండడం విశేషం. ఈ నెలలో చాలా మంది మాంసాహారాలకు దూరంగా ఉంటారు. ఈమాసంలో వచ్చే నాగుల చవితి, వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి ఇలా ముఖ్యమైన పండుగలు బంధాలు, బాంధవ్యాలను తెలుపుతాయి. సంస్కృతి, సాంప్రదాయాల్లోను ఈమాసానికి ప్రత్యేకత ఉంది.



శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి

కరువు ప్రభావం



ఈ సారి శ్రావణమాసంలో జరగనున్న పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలపై కరువు ప్రభావం తీవ్రంగానే కనబడుతోంది. జిల్లాలో రెండేళ్లుగా కరువు తిష్ట వేసింది. పలు మండలాల్లో వర్షాధారంపై ఆధారపడి సాగు చేసిన పత్తి, మినుము, వేరుశనగ, బుడ్డశనగ వంటి పంటలు నిలువునా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎక్కడైనా అరకొరగా పండిన పంటలకు సైతం కనీస మద్దతు ధరలు లభించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏ సీజన్‌లో నష్టపోతే ఆ సీజన్‌లోనే రైతులకు పరిహారం అందించి ఆదుకున్నారు. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ. 20 వేలు చొప్పున అందిస్తామని ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికీ అమలు చేయలేదు. పైగా గతేడాది పండించిన పంటలకు ధరలు లేక రైతులు బాగా నష్టపోయారు. జిల్లాలో నెలకొన్న కరువు, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు లేకపోవడంతో ఆడపిల్లల తల్లిదండ్రులకు పిల్లల పెళ్లిళ్లు చేయడం భారంగామారింది.

- మరోవైపు బంగారం ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. మంగళవారం కడప మార్కెట్ 24 క్యారెట్ల ఒక గ్రాము బంగారం ధర రూ. 10,129గా ఉంది. అంటే తులం బంగారం ధర రూ. 1,01,290 పలికింది. 22 క్యారెట్ల ఒక గ్రాము బంగారం ధర రూ. 9285 ఉంది. అంటే తులం రూ. 92,850 పలుకుతోంది. వివాహం చేయాలంటే కనీసం 10 తులాల బంగారమైనా కొనుగోలుచేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన బంగారు కొనుగోలుకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం దేవాలయాలు, ఇళ్ల వద్ద పెళ్లిళ్లు నిర్వహించడం లేదు. ప్రతి ఒక్కరూ కల్యాణ మండపాల్లోనే వివాహ క్రతువును నిర్వహిస్తున్నారు. సగటున రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు కల్యాణ మండపానికే కావాల్సి వస్తోంది. ఇక మండపాల డెకరేషన్‌కు కనీసం రూ. లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుంది. ఇక వివాహ భోజనాలకు ఎంతలేదన్నా రూ. 5 లక్షలకు పైగా చెల్లించాల్సి వస్తోంది. అలాగే మంగళ వాయిద్యాలు, వస్త్రాలు, పూలు, వీడియో, ఫోటోషూట్‌లు, ఇతర ఖర్చులు వేసుకుంటే సాదాసీదా వివాహానికి సగటున రూ. 20 లక్షలు వరకు అవుతోంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలు తమ ఆడపిల్లల వివాహాలు చేయడం తలకుమించిన భారంగా మారింది.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాజంపేట టౌన్: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించినప్పుడే భవిష్యత్తులో ఉన్నతంగా రాణించగలరని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం సైన్స్ సిటీ, ముస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్ష విద్యా అవగాహనా శిబిరాన్ని కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నదంతా సాంకేతిక యుగమని, అందువల్ల విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికత పరిజ్ఞానాన్ని, శాస్త్రవేత్తలు అయ్యేందుకు అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఓ పక్షి పట్టుదల కథను కలెక్టర్ విద్యార్థులకు తెలియచేశారు. పట్టుదల ఉంటే మనిషికి అసాధ్యం అన్నది ఏది లేదన్నారు.సైన్స్‌సిటి ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజంపేటలో సైన్స్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంతరిక్ష అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి శిబిరాలు దోహదపడగలవన్నారు.కార్యక్రమంలో ముస్కాన్ అధికారి ప్రనేష్‌దేబ్‌నాథ్, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, తహశీల్దార్ పీరుమున్ని, ఎంపిడిఓ పగడాల వరప్రసాద్, ఎంఈఓ కొండూరు రఘునాథరాజు, సెక్టోరియల్ అధికారి జనార్దన్, పాఠశాల హెచ్‌ఎం నాగమణి, ఆప్‌కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో ఎంపిక చేసిన 10 గ్రామాల్లో అభివృద్ధి పనులపై వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎం ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో 10 గ్రామాలు ఎంపికయ్యాయన్నారు.ఇందులో 8 గ్రామాలకు సంబంధించిన విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్లను ఇంకా సమర్పించలేదని, ఎంపీడీఓలు వెంటనే తయారుచేసి జెడ్పీ సీఈఓ ద్వారా అందించాలని ఆదేశించారు.




ఇతని పేరు అనిల్ కుమార్ రాజు. సంబేపల్లి మండలం..జూన్ నెలలో కురిసిన కొద్దిపాటి వర్షానికి నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాడు. పంట సాగు కోసం లక్షన్నర రూపాయలు ఖర్చు చేశాడు. ప్రభుత్వం ఇస్తానన్న పంట సాయం (అన్నదాత సుఖీభవ) డబ్బులు ఇవ్వలేదు. పూటకు ఒకలా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారు. ఈ ఏడాది కూడా ఇస్తారన్న నమ్మకం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జిల్లా వ్యాప్తంగా రైతుల పరిస్థితి ఇది.

నిరీక్షణ.. నిస్తేజం



- అన్నదాత సుఖీభవ నిధుల విడుదలెప్పుడో?
- సాయం కోసం రైతుల ఎదురుచూపులు



రాయచోటి ప్రాంతంలో సాగులో ఉన్న వేరుశనగ పంట


రాయచోటి: ఎన్నెన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అమలులో అలక్ష్యం చేస్తోంది. అన్నదాతను ఆదుకోవడంలో ఇప్పటికీ నిర్లక్ష్యం వహిస్తోంది. అన్నదాత సుఖీభవ అందిచడంలో శ్రద్ధ కనిపించడం లేదు. ఎన్నికలకు ముందు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పినా ఇప్పటికీ చిల్లిగవ్వ ఇవ్వలేదు. రైతులు ఎరువులు, విత్తనాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అన్నదాత సుఖీభవ నిధుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

1,81,500 మంది రైతులే అర్హులట..

తాజా అంచనాల ప్రకారం జిల్లాలో 1,81,500 మంది పీఎం కిసాన్ పథకానికి అర్హులుగా గుర్తించారు. కేంద్రం గుర్తించిన వారికి రాష్ట్రం కూడా అన్నదాత సుఖీభవ అర్హత జాబితాలో పొందుపరుస్తున్నట్లు సమాచారం. గత వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లా నుంచి ఏటా రెండు లక్షల మందికి పైగా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పీఈఎం కిసాన్ పథకాన్ని అందించారు. అంటే గతంలో ఇచ్చిన 20 వేల మందికి పైగా రైతులను అన్నదాత సుఖీభవ పథకానికి దూరం చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా తన వాటాగా ఇస్తామన్న రూ. 14 వేలలో రూ. 5 వేలు ఇచ్చేయొచ్చుగా అని రైతులు అడుగుతున్నారు. పీఎం కిసాన్ కోసం ఎదురు చూస్తూ ఉంటే ఆలస్యం అయి పోతోందని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

బూటకపు హామీలతో అధికారంలోకి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బూటకపు హామీలు ఎన్నో ఇచ్చింది. రూ. 15 వేలు అన్నారు. చివరకు వచ్చే ఏడాది కాలంగా దాటవేస్తూ వస్తున్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి 15 వేల కోట్ల రూపాయల భారం వేశారు. గత ప్రభుత్వం రూ. 13500 ఇస్తే..మేము అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు ఇస్తామన్నారు. రెండో ఏడాదిలో సీజన్ ప్రారంభమైనా నయాపైసాను ప్రభుత్వం విడుదల చేయలేదు. డబ్బు లేనప్పుడు హామీలు ఎందుకు ఇవ్వాలి? మోసం ఎందుకు చేయాలి అని ప్రజలు, రైతులు ప్రశ్నిస్తున్నారు. అన్నదాత సుఖీభవం డబ్బులు జూన్ 12న ఇస్తామన్న ప్రభుత్వం మాట మార్చింది. జూలై 20న అమలు చేస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయి. సత్వరమే అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.



వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో..



వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రూ. 1049.62 కోట్లను వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేసింది. అలాగే తీవ్ర వర్షాభావం వల్ల దెబ్బతిన్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్, నష్టపరిహారాన్ని అందజేసి అన్నదాతకు తోడుగా నిలిచింది. ఏటా జూన్ నెలలోనే మొదటి విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి వారి వ్యవసాయ సాగు ఖర్చుల్లో భాగస్వామ్యంగా నిలిచింది. కోటి ఆశలతో కూటమి పాలనలోకి అడుగుపెట్టిన రైతులకు ప్రభుత్వం నుంచి గత ఏడాది అందాల్సిన అన్నదాత సుఖీభవ డబ్బులు రాలేదు. ఈ సవత్సరం ఖరీఫ్ సీజన్ సగం అయిపోయింది. జూలై నెల కూడా ముగుస్తోంది. అయినా ఇంకా డబ్బులు అకౌంట్లలో జమ కాలేదు. వస్తాయని, ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఎప్పుడు అనే ప్రశ్న తెరపైకి వస్తుంది. ఇదిగో, అదిగో అంటూ రోజులు గడుస్తున్నాయే తప్ప పథకం అమలు కాలేదని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కూడా భగ్గుమంటోంది. కేంద్రం ఎప్పుడు పీఎం కిసాన్ డబ్బులు ఇస్తే అప్పుడే తాము కూడా అన్నదాత సుఖీభవ అందజేస్తామంటూ దాటవేత ధోరణితో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

వైఎస్సార్ ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
2019-20	1,98,748	202.46
2020-21	2,08,836	210.92
2021-22	2,10,810	215.67
2022-23	2,01,829	268.62
2023-24	2,02,094	151.95

రైతుల గోడు పట్టని ప్రభుత్వం



ఈ ప్రభుత్వానికి రైతుల గోడు పట్ట దం లేదు. ఖరీఫ్ సాగు కోసం రైతులు అప్పు లు చేసి దుక్కులు చేసుకున్నారు. పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందించే డబ్బుల కోసం ఎదురు చూసినా ఫలితం లేదు. అప్పు చేసి కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువులు రైతుల ఇళ్లలోనే ఉండిపోయాయి. గతేడాది అన్నదాత సుఖీభవ నిధులతో కలిపి ఈ ఏడాది నిధులను ఇవ్వాలి. –సుగవాసి బాలసుబ్రమణ్యం, జెడ్పీ మాజీ చైర్మన్, రాయచోటి

క్లుప్తంగా

బైక్ దగ్ధం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



కాలిపోయిన బైక్

మదనపల్లె రూరల్ : గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిముందు నిలిపిన బైక్‌ను దగ్ధం చేసిన ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీకి చెందిన మేస్త్రీ పాపన్న తన ఇంటి ముందు పల్సర్‌బైక్‌ను నిలిపి ఉంచారు. ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒకసారిగా ఇంటి ముందు మంటలు గుర్తించి బయటకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సారా కేసులో నిందితుడి అరెస్టు

కేవీపల్లె : సారాతోపాటు ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మండలంలోని నూతనకాల్వ పంచాయతీ గొర్లకణం పల్లె వద్ద ఉప్పుతోళ్ల హరి అనే వ్యక్తి ఐదు లీటర్ల సారా కలిగి ఉండగా బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

కారును ఢీ కొన్న లారీ



ప్రమాదంలో గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంగంపేట వద్ద కడప–చెన్నై జాతీయ రహదారిపై బుధవారం కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజంపేటలోని నూనె వారిపల్లికి చెందిన నలుగురు కారులో కడపకు వెళ్తుండగా మంటపంపల్లి వద్ద ఉన్న దాబాల సమీపానికి రాగానే కడప నుండి చెన్నై వెళ్తున్న గ్యాస్ లారీ ఎదురుగా వచ్చి ఢీ కొంది. దీంతో కారులోని తరుణం (17), కిరణ్ (20), రాఘవేంద్ర (20), బాలు (23) అనే నలుగురు యువకులకు రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 సహాయంతో కడప రిమ్స్‌కు తరలించారు.

ప్రక్షాళన దిశగా కడప కేంద్ర కారాగారం

– రాయలసీమ జైళ్లశాఖ ఇన్‌చార్జి డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌లు దొరుకుతున్నాయని, నిబంధలకు విరుద్ధంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు ప్రక్షాళన చేసేందుకు తనను విచారణకు పంపించారని జైళ్లశాఖ రాయలసీమ రేంజ్ ఇన్‌చార్జి డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ విచారణలో సెల్‌ఫోన్‌లు బయటనుంచి విసిరేస్తున్నారని తెలుసుకున్నామన్నారు. సెల్‌ఫోన్‌లు దొరికిన ప్రతిసారీ పోలీసులకు ఫిర్యాదు చేసి ఉంటే బాగుండేదన్నారు.

ఆరా పేరుతో టోకరా!

- వీడియోలు చూడండి.. డబ్బులు సంపాదించండి
- నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా లక్షలు వసూళ్లు
- మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 6 వేలకు పైగా బాధితులు
- న్యాయం చేయాలంటూ తాలూకా పోలీస్ స్టేషన్‌కు పరుగులు
- సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు



తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట జరిగిన మోసాన్ని వివరిస్తున్న బాధితులు

మదనపల్లె రూరల్ : ఆరా యాప్.. కేవలం రూ.2వేలు చెల్లించండి. ప్రతిరోజు వాట్సాప్ గ్రూప్‌నకు మేము పంపే 5 వీడియోలు చూస్తే చాలు.. మీ ఖాతాలో వేలకు వేలు డబ్బులు జమ అవుతాయంటూ పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని, భారీ స్థాయిలో ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన వైనం బుధవారం మదనపల్లెలో వెలుగు చూసింది. బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు తాలూకా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని మీడియాతో తమ గోడును వినిపించారు. ఆరా బురిడీ కొట్టించిన వైనంపై సైబర్ క్రైమ్ సెల్‌కు స్థానికుడైన వి. రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకకు చెందిన మోహన్‌బాబు.. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఆరా యాప్ నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఆరా యాప్‌లో.. రూ.2వేలు డిపాజిట్ చెల్లించి సభ్యులుగా చేరితే.. సభ్యులను గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపునకు ఒక్కో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేస్తారు. అందులో ప్రతిరోజు 5 వీడియోలను వాట్సప్ లింక్ ద్వారా పంపుతారు. వాటిని వీక్షిస్తే..ఒక్కో వీడియోకు రూ.65 చొప్పున నగదు నేరుగా సభ్యుడి బ్యాంకు వ్యక్తిగత ఖాతాకు ఆన్‌లైన్‌లో జమచేస్తామని చెబుతారు. ఇలా మొదట్లో చేరిన సభ్యులకు...తంచనుగా డబ్బులు ఖాతాలకు జమచేస్తూ వచ్చాడు. అంతేకాకుండా ఈ యాప్‌లోని స్పిన్ వీల్‌లో మీ అదృష్టాన్ని పరీక్షించుకుంటే, అందులో గెలిచిన బహుమతులను సైతం ఇస్తామని ప్రకటించారు. మొదట్లో గెలిచిన కొద్దిమందికి ఇచ్చారు. బహుమతులు, డబ్బులు జమ అయిన సభ్యులతో తాము ఎలా లాభం పొందిందనే విషయం వారి మాటల్లోనే చెప్పిస్తూ వీడియోలు తీసి విస్తృతంగా ప్రచారం చేశాడు. దీంతో వేలసంఖ్యలో ప్రజలు ఆరా యాప్‌లో సభ్యులుగా చేరారు. సులభంగా డబ్బులు వస్తాయనే దురాశతో మదనపల్లె పరిసర ప్రాంతాల్లో సుమారు 6వేల మందికి పైగా డిపాజిట్లు చెల్లించి సభ్యులుగా చేరారు. ఆరా యాప్ నిర్వాహకులు చెప్పినట్లుగానే వీడియోలు చూశారు. డబ్బులు ఖాతాకు జమచేసినట్లు యాప్‌లో మెసేజ్ వచ్చింది. అయితే డబ్బులను ఖాతా నుంచి తీసుకునేందుకు వెళితే మాత్రం డబ్బులు జమ కాలేదని తెలవడంతో మోసపోయామని గుర్తించారు. కొద్ది రోజులుగా ఆరా యాప్ పేరుతో క్రియేట్ చేసిన వాట్సప్ గ్రూప్ ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లింది. దీంతో బాధితులు తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమకు జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆరా యాప్ సొమ్ముల కోసం నిర్వాహకులకు తెలియజేసిన ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతాల సమాచారంతో భవిష్యత్తులో తమకు ఏదేని ఇబ్బందులు తలెత్తవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన మోసంపై పోలీసుల సలహా మేరకు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నిర్వాహకుడైన మోహన్‌బాబును ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తే.. అందుబాటులోకి రాలేదు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

మదనపల్లె రూరల్ : బాలల హక్కుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు జరిపితే కఠినమైన శిక్షలు విధిస్తామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి జి.ఉమాదేవి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా బుధవారం... జేజే యాక్ట్ 2015, పీసీఎంఏ యాక్ట్ 2006, పోక్సో యాక్ట్ 2012, ది చైల్డ్ లేబర్ ప్రొహిబిషన్, రెగులేషన్ యాక్ట్ 1986, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994, ది సీపీసీఆర్ యాక్ట్ 2005 పై డివిజన్ స్థాయిలో సీడబ్ల్యూపీఓ, పంచాయతీ సెక్రటరీలు, ఎంఈఓ, ఎంఎస్‌కే, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఐసీడీఎస్ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ బాలికల అక్షరాస్యతా శాతాన్ని మరింతగా పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికా నిష్పత్తిని పెంచాలన్నారు. సమాజంలో అనాథ బాలలు, పాక్షిక అనాథలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాలలు, భిక్షాటనకు గురి అవుతున్న బాలలు, బాల్యవివాహాలకు గురిఅవుతున్న బాలలు, రక్షణ, సంరక్షణ అవసరమైన బాలలను సంరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ బాలలకు గ్రామ స్థాయి నుంచి ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామ స్థాయి కమిటీలను నియమించామన్నారు. కార్యక్రమంలో పోర్ట్ లలితమ్మ, సీడీపీఓ సుజాత, భారతి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు చర్మవ్యాధి నిరోధక టీకాలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఇసుకపల్లిలో ఆవులకు ముద్దచర్మ వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్ద చర్మవ్యాధి రాక ముందు, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో నందలూరు పశువైద్యులు డాక్టర్ ఈశ్వరప్రసాద్, డాక్టర్ మాధవీలత, వీఏడీ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు జాహ్నవి, శిరీషా, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

పురిటి బిడ్డ మృతిపై విచారణ



బాధితురాలి కుటుంబ సభ్యులను విచారిస్తున్న వైద్యాధికారులు

తంబళ్లపల్లె : తంబళ్లపల్లెకు చెందిన రిహానా, బాబ్‌జాన్ దంపతుల కుమార్తె ఆర్షియా అంజుమ్ మొదటి కాన్పు ప్రసవ వేదనతో శనివారం స్థానిక సీహెచ్‌సీలో చేరారు. ఆమెకు ఆస్పత్రి సిబ్బంది సహజప్రసవం కోసం ప్రయత్నం చేశారు. ఆదివారం అర్ధరాత్రి 12.45 నిమిషాలకు కాన్పు కష్టమని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆ సమయంలో 108 వాహనం అందుబాటులో లేక ప్రైవేటు అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరారు. అక్కడ డెలివరీ అయింది. అయితే మగబిడ్డ మృతి చెందాడు. తంబళ్లపల్లె ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, ఆలస్యం చేయడంతోనే బిడ్డ చనిపోవడానికి కారణమని బాధితులు వాపోయారు. ఈ విషయాన్ని డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పీలేరు మెడికల్ ఆఫీసర డాక్టర్ చంద్రశేఖర్, గైనకాలజిస్టు శ్రీలత బృందాన్ని విచారణ కోసం పంపారు. బుధవావారం సీహెచ్‌సీలో బాధితురాలి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ తేజస్విలను విడివిడిగా విచారించి స్టేట్‌మెంట్‌లను తీసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు విచారణ అధికారులు తెలిపారు.

9న బౌద్ధుల చలో మదనపల్లె



చలో మదనపల్లె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె రూరల్ : బుద్ధుని కొండలో బుద్ధుడి విగ్రహానికి అధికారులు కంచె ఏర్పాటు చేసి, కొండపైకి వెళ్లే దారిని మూసివేయడంపై ఆల్ ఇండియా భిక్కు సంఘం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సమన్వయకర్త భంతే సద్ధారక్కిత ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని బౌద్ధుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా పరిగణిస్తామని, ఆగస్టు 9న బౌద్ధ భిక్షువులు, బౌద్ధాభిమానులు పెద్ద సంఖ్యలో మదనపల్లెకు తరలివచ్చి బుద్ధుని కొండలో జరుగుతున్న దుర్ఘటనలపై తేల్చుకుంటామని హెచ్చరించారు. ఆల్ ఇండియా భిక్కు సంఘం, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, బుద్ధిస్ట్ ఫ్రెటర్నటీ కౌన్సిల్, మహాబోధి సొసైటీ, బుద్ధ అంబేద్కర్ సమాజ్, అంబేద్కర్ బుద్ధిస్ట్ సొసైటీ తదితర బౌద్ధ సంఘాలతో పాటు అంబేడ్కరిస్టులు, దళిత, వామపక్ష, ప్రగతిశీల సంఘాలను ఏకంచేసి, ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించేలా మదనపల్లెలో ధమ్మ నిరసన చేపడతామన్నారు. ఆగస్టు 9లోపు బుద్ధుడి విగ్రహం ధ్వంసంతో పాటు తల వేరుచేసిన ఉన్మాదులను అరెస్ట్ చేయాలన్నారు. బుద్ధునికొండకు వేసిన కంచెను తొలగించడంతో పాటు బౌద్ధులపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుపై ఎస్సీ,ఎస్టీ(పీఓఏ) యాక్ట్‌లోని సెక్షన్ 4 కింద కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం ఆగస్టు 9న చలో మదనపల్లె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందు బౌద్ధ ఉపాసకులు పీటీ యం.శివప్రసాద్ ఇంటికి వెళ్లి, గుండెకు స్టంట్ వేసుకుని విశ్రాంతిలో ఉన్న ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు ముత్యాల మోహన్, సొన్నికంటి రెడ్డెప్ప, జనార్దన్, గంగాధర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


నానో యూరియా డీఏపీతో అధిక లాభాలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ

పెనగలూరు : నానో యూరియా డీఏపీ వలన అధిక ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ అన్నారు. బుధవారం కోమంతరాజుపురం, ఓబిలి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడటం వలన భూమి సారవంతం కోల్పోతుందన్నారు. పంట దిగుబడి కూడా తగ్గిపోతుందన్నారు. రైతులు వాటి స్థానంలో నానో యూరియా డీఏపీ, నానో జింక్ వాడినట్లయితే పంట పెరుగుదల ఉంటుందన్నారు. భూమి సారవంతం కోల్పోకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్రమణ్యం, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



షేక్ మస్తాన్‌బీ

కలసపాడు : మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ(30) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ తిమోతి బుధవారం తెలిపారు. సోమవారం సాయంత్రం మస్తాన్‌బీ దుకాణానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె భర్త హసన్‌వలీ ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100632 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.


భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంటు



బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంటు ప్రతినిధులు

సిద్దవటం : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంటు పటిష్టమైనదని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ ఎస్. శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ అధికారి రమణారెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామంలోని మదర్ థెరిస్సా ఎంటర్ ప్రైజస్ సమీపంలో తాపీ మేస్త్రీలకు సిమెంటు వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతి సిమెంటు రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. అనంతరం వారు 40 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ కె. వెంకట్రామిరెడ్డి, మేస్త్రీలు పాల్గొన్నారు.

చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయండి



చలో విద్యుత్ సౌధ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మిక నేతలు

రాయచోటి : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో విద్యుత్ సౌధ విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ కోరారు. బుధవారం రాయచోటిలోని విద్యుత్ కార్యాలయ ఆవరణంలో ఆగస్టు 7న ఛలో విద్యుత్ సౌధ విజయవాడ పోస్టర్లను కార్మికులతో కలిసి విడుదల చేశారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, యూనియన్ నాయకులు ఏవీరమణ, యుఐసీడబ్ల్యు డిస్కమ్ అధ్యక్షుడు కె.సుబ్రమణ్యం రాజు కోరారు. 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు నగేష్ గౌడ్, కార్యదర్శి డి.శ్రీనివాసులు రెడ్డి, యూనియన్ నాయకులు రామాంజులు రెడ్డి, ఖాదర్ బాషా, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడుపుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది, మహిళల రక్షణకోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ద్విచక్ర వాహనాలను బుధవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ఆవరణంలో ఎస్పీ ప్రారంభించారు. రాష్ట్ర పోలీసు అధికారులు జిల్లాకు 16 వాహనాలను కేటాయించినట్లు ఎస్పీ తెలిపారు. హెల్మెట్ ప్రాధాన్యతను తెలియపరిచేలా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులతో కలిసి హెల్మెట్ ధరించి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి మాసాపేట, ఠాణాసర్కిల్, బంగ్లా సర్కిల్, శివాలయం సర్కిల్ వరకు తిరిగి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ బరువు కాదు, బాధ్యత అని ప్రాణాలకు రక్ష అని తెలిపారు. జుట్టు ఊడుతుందనో, తలపై బరువు అనో వెళ్లేది తక్కువ దూరమే అన్న కారణంతో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్నారని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమే కాదు విలువైన ప్రాణాన్ని ప్రమాదంలోకి నెట్టడమే అని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులే అన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంలో వెనుకవైపు కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకోసం 16 ద్విచక్ర వాహనాలను రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుంచి అన్నమయ్య జిల్లాకు కేటాయించారన్నారు. జిల్లాలో రాజంపేట, రాయచోటి, మదనపల్లె సబ్ డివిజన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి.. పెట్రోలింగ్ నిర్వహించేందుకు మహిళల భద్రతకు ఈ ద్విచక్ర వాహనాలను వినియోగిస్తామన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, మదనపల్లి డీఎస్పీ ఎస్ మహేంద్ర, రాయచోటి డీఎస్పీ ఎం ఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం శ్రీనివాసులు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో అంటరానితనం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

మదనపల్లె రూరల్ : ఎస్సీలకు టీటీడీ దేవస్థానంలో ప్రాధాన్యత లేదని, అక్కడ అంటరానితనం స్పష్టంగా కనిపిస్తోందని, అన్యమతం పేరుతో భారతీయులను దూరం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీటీడీ బోర్డు మీటింగ్‌లో..అన్యమతం గురించి యూపీఎస్సీ సివిల్ సర్వెంట్ మాట్లాడటం బాధాకరం, రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీజేపీ పేదరికాన్ని తీసేయలేక, నిరుద్యోగాన్ని తొలగించలేక ఫాసిస్టు మాటలు మాట్లాడుతోందన్నారు. 1912లో ముల్లార్ మదనపల్లెలో టీబీ శానిటోరియం స్థాపించి, టీబీ జబ్బుకు మందులేని కాలంలో అన్యమతం భేదం లేకుండా అందరికీ వైద్యం అందించారన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమని చెప్పారు. మదనపల్లె ఫైల్స్ దగ్ధం కేసులో విచారణ సత్వరమే పూర్తి చేసి నిందితులెవరో ప్రజలకు తెలపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు రెడ్డిసాహెబ్ పాల్గొన్నారు.

అధికార పక్షానికి 144 సెక్షన్ వర్తించదా!



మంగంపేట నుంచి రైల్వేకోడూరుకు బైక్ ర్యాలీగా వెళ్తున్న జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

సాక్షి టాస్క్ ఫోర్స్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం 144 సెక్షన్ అమల్లోకి తెచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఏ కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వలేదు. దీంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలు పార్టీ కార్యక్రమాలను రద్దు చేసుకుంది. అయితే హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఓబులవారిపల్లి మండలం చెన్నకేశవ స్వామి గుడి నుంచి రైల్వేకోడూరు పట్టణం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో పెద్దఎత్తున జన సమీకరణ చేశారు. డిప్యూటీ సీఎం సినిమా కావడంతో పోలీసులు కూడా వారిని అడ్డుకునే పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వంలో కూటమి నాయకులకు ఒక చట్టం, ఇతర పార్టీ నాయకులకు మరో చట్టం మాదిరిగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

మాపై దౌర్జన్యం చేస్తున్నారు



పోలీసు అధికారులతో కలిసి వస్తున్న అధికార పార్టీ నాయకులు

రాయచోటి టౌన్ : అధికార పార్టీకి చెందిన కొందరు తమపై దౌర్జన్యం చేసి స్థలం ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆరోపించారు. ఈమేరకు బుధవారం రాయచోటి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం చిత్తూరు రింగ్ రోడ్డు సమీపంలో సర్వే నంబర్ 553లో పీడీఆర్ ఫంక్షన్ హాల్ నిర్మించుకున్నామన్నారు. తమ ఫంక్షన్ హాల్‌కు దక్షిణం వైపు 40 అడుగులు సిమెంట్ రోడ్డు వేసుకుని అనుభవిస్తున్నామన్నారు. ఈ స్థల విషయమై కోర్టు ద్వారా 552/25 ఏఎస్ నంబర్ 170/25గా రాయచోటి పట్టణం ఎన్‌జీఓ కాలనీలో నివాసం ఉంటున్న మండెం ఆదినారాయణ రెడ్డి పైన దావా వేసి ఇంజక్షన్ ఆర్డర్ పొంది ఉన్నామని తెలిపారు. అయితే ఆదినారాయణరెడ్డి, ఆయన భార్య, అల్లుడితో పాటు మరి కొంత మంది అనుచరులతో కలసి దౌర్జన్యంగా వచ్చి తాము వేసుకున్న సిమెంట్ రోడ్డును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మాది అంటూ భయపెడుతున్నారని చెప్పారు. దీనికి సంబంధించిన ఇంజక్షన్ ఆర్డర్ జిరాక్స్ కాపీని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పొందుపరిచినట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి



రైలు కిందపడి మృతి చెందిన యవకుడు



అపస్మారక స్థితిలో పడి ఉన్న భక్తవత్సలం

కడప కోటిరెడ్డిసర్కిల్ : చెన్నై నుంచి కడప వరకు టిక్కెట్ తీసుకున్న గుర్తు తెలియని యువకుడు తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో రైలు కింద పడి మృతి చెందాడని తాడిపత్రి రైల్వే హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి ఓ గుర్తు తెలియని యువకుడు రూ. 115 చెల్లించి టిక్కెట్ తీసుకున్నాడన్నారు. ఈయన కడపలో దిగకుండా తాడిపత్రి–అనంతపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి మృతి చెంది ఉన్నాడన్నారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అపస్మారక స్థితిలోని వ్యక్తి రిమ్స్‌కు తరలింపు

కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో భక్తవత్సలంనాయుడు అనే వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఈ మేరకు పాదచారులు ఇచ్చిన సమాచారం మేరకు కానిస్టేబుల్ మహేష్, ఏఎస్‌ఐ శ్రీరాములు నాయక్, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకుంట రవి, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ గోగు వెంకట సురేష్‌బాబులు గమనించి 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అతని జేబులో ఉన్న ఫోన్ ద్వారా కుమారుడికి సమాచారం అందించామని, ఆయన హైదరాబాదు నుంచి కడపకు వస్తున్నారని తెలిపారు.